# అశ్రువులు రాలినవేళ

**ప్రభాత సమయం.** పక్షుల కిలకిలరావాలతో సందడిగా ఉంది వాతావరణం. వసంత ఋతువు ఆగమనంతో ప్రకృతి వింత అందాలను సంతరించుకుని కళ్లకు విందు చేస్తోంది. కుంతీ మాధవస్వామి ఆలయంలో బ్రహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన మైకుల్లోంచి భక్తిగీతాలు మృదుమధురంగా వినవస్తున్నాయి. స్నానాది కృత్యాలు ముగించుకుని దేవుడి గదిలోకి అడుగుబెడుతూ ఉండగా 'నాన్నా' అంటూ వచ్చింది కల్పన.

ఏమిటన్నట్లు చూసాను ఆమె వంక.

'అన్నయ్యని పోలీసులు పట్టుకున్నారు నాన్నా' అంది పేపరు చూపిస్తూ ఆమె గొంతు జీరబోయింది. తోడబుట్టినవాడు జైలు కెళ్లాడన్న వ్యధ ఆమె కంఠంలో కదలాడుతోంది.

అ ప్రయత్నంగా పేపర్లోకి చూసాను. 'పోలీసుల కళ్ళల్లో కారం కొట్టి తప్పించుకు తిరుగుతున్న సూర్యారావు అరెస్టు'

హెడ్‌లైన్సులో వున్న ఆ వార్తని కళ్ళు చూస్తున్నాయి. కాని మనసు ఇక్కడ లేదు. కన్న బిడ్డ కటకటాల వెనుక దీనంగా కనిపిస్తున్నాడు.

అయినా చలించలేదు నా మనసు.

నేరస్తుణ్ణి నేనైతే అసలు దొంగని విడిచిపెట్టి అనామకుణ్ణి పట్టుకున్నారు. నేను అపరాధినని మొరపెట్టుకున్నా చట్టం నన్ను శిక్షించదు. అరదండాలు వేయదు. ఏమిటీ విడ్డూరం?...

ఉన్నట్లుండి నా అంతరంగ కడలిలో అనుభవాల అలలు ఉవ్వెత్తున ఎగిసాయి. గుండెలోతుల్ని స్పృశించాయి.

నామ మాత్రపు చదువు. అంతంత మాత్రపు ఉద్యోగం ఇవే నేను ఆలస్యంగా పెళ్ళి చేసుకోడానికి గల కారణాలు. అర్ధాంగి నా కంటె ఉన్నతంగా ఉండటం వల్ల నాలో ఓ విధమైన ఇన్‌ఫీరియారిటీ ఫీలింగు ప్రవేశించింది. భార్యా విధేయుణ్ణి కాకపోయినా అర్చన అంటే ఎందుకో బెదురు. భర్తని పిడికిట్లో పెట్టుకోవాలని కాదు గాని సంసారం ఒడుదుడుకులు లేకుండా సాగిపోవాల్న సదుద్దేశంతో నేను ఖర్చుపెట్టే ప్రతిపైసాకి వివరాలు అడిగేది. ప్రభుత్వ పాఠశాలలో సెకండరీ గ్రేడు టీచరామె. నేనేమో ఓ చిన్న ఆటో మోబైల్ వర్కుషాపులో గుమస్తాని. నా కొచ్చేజీతం జేబు ఖర్చులకు కూడా సరిపోదు అయినా ఆ డబ్బులు కూడా అడిగి పుచ్చుకునేది అర్చన.

భార్య ముందు పెదవి విప్పలేని బలహీనత నాది. అలా అని అవసరాలకు చేయిచాపలేను. ఖర్చును అదుపులో ఉంచాలన్న తపనే తప్ప పొదుపు పేరుతో కుటుంబ సభ్యుల్ని పస్తులు పడుకోబెట్టాలన్న మనస్తత్వం కాదామెది. ఆ విషయం నాకు బాగా తెలుసు. అందుకే మా మధ్య పొరపచ్చాలు లేవు. పైగా ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకుని చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అన్న సూక్తిని అక్షరాలా పాటించాం. పెద్దవాడు సూర్యం. రెండవది కల్పన. సూర్యం చురుకైనవాడు. ఎప్పుడూ వాడికి క్లాసులో ఫస్టుమార్కులే. వాడు కలెక్టరైపోవాలన్న గొంతెమ్మ కోరిక మాకులేదు. మా మీద రవంత ఉన్నతంగా ఉంటే చాలనుకున్నాం.

రాను రాను సూర్యం నడతలో మార్పు రాసాగింది. అతడి ప్రవర్తన పతనానికి దారితీయడం మొదలు పెట్టింది. అందుకు కన్న తండ్రిగా నేనెంత వరకు బాధ్యుణ్ణో ప్రశ్నించు

కుంటే బాగుండేదేమో! అయితే ఆ తలంపుకి నేనెప్పుడూ తావివ్వలేదు. ఫలితంగా సూర్యం జీవితం పెడదారి పట్టింది.

'అమ్మ అడిగితే అరటికాయలు డజను పద్దెనిమిది రూపాలయిలని, బీరకాయలు కిలో ఎనిమిది రూపాయిలని చెప్పు' దారి పొడుగునా సూర్యానికి సూచనలిస్తూ వచ్చాను. అలాగే అన్నట్లు తల ఆడిస్తూ నేర్చుకున్న పాఠాన్ని తూ.చ. తప్పకుండా అప్పజెప్పేవాడు.

సరుకులు కొనేందుకు అంగడికి వెళ్ళినప్పుడెల్లా తోడుగా ఉంటాడని సూర్యాన్ని నాతో పంపేది అర్చన.

కొన్నాళ్ళకు వాడికి అసలు రహస్యం తెలిసిపోయింది. నా మాటకు వంత పాడాలంటే తనకూ కొంత కమిషన్ కావాలన్నాడు. మారు మాట్లాడకుండా అర్ధ, పావలా వాడిచేతిలో పెట్టి ఆ పసివాడి నోరు మూయించేవాణ్ణి. భార్యని అడక్కుండా అవసరాలు తీరిపోతున్నాయని మురిసిపోయానే తప్ప ఇది దురలవాటని, ఏతండ్రి ఇటువంటివి తన బిడ్డకు నేర్పకూడదని తెలుసుకోలేక పోయాను. పిల్లల మనస్తత్వం మీద నాకు సరియైన అవగాహన లేకపోవడమే అందుక్కారణం. క్రమేపి తండ్రిని మించిన తనయుడయ్యాడు సూర్యం.

'బజారుకి నాన్నెందుకమ్మా? కావలసినవేవో చెబితే నేనే పట్టుకొస్తాను' అన్నాడు సూర్యం. వాడు అలా ఎందుకంటున్నాడో తెలిసినా మందలించలేని స్థితి నాది.

బిడ్డ నా చేయి దాటిపోయాడు. చేతిలో విరివిగా డబ్బులాడటంతో వాడికి చదువుమీద ధ్యాస తగ్గింది. సిగరెట్లు కాల్చడం, సినిమాలు చూడటం లాంటి అలవాట్లు వంటబట్టాయి. హోటళ్ళలో చిల్లర తిళ్ళకు అలవాటు పడ్డాడు.

అవసరాలకు డబ్బు చాలకపోవడంతో ఒకరోజు ఇంట్లో దొంగతనం చేసి దొరికిపోయాడు.

కోపం పట్టలేక బిడ్డను చావబాదింది అర్చన. చేతులునొప్పి పుట్టాయిగాని వాడిలో వీసమంతైనా మార్పు రాలేదు. డబ్బుకోసం రకరకాల మార్గాల్ని అన్వేషించడం ప్రారంబించాడు.

'అన్నయ్య ఈ మధ్య స్కూలుకు రావడం లేదే' తల్లితో ఫిర్యాదు చేసింది కల్పన.

చెల్లాయి మీద విరుచుకు పడ్డాడు సూర్యం.

చేసిన వెధవ పనికి లెంపలేసుకోక దాని మీద మండిపడతావెందుకు? అంది అర్చన.

ఉక్రోషంతో ఇంట్లోంచి ఉడాయించాడు సూర్యం. ఆకలేస్తే చచ్చినట్లు వాడే వస్తాడనుకుంది అర్చన. అయితే రాత్రి పదైనా బిడ్డ ఇంటికి చేరకపోయేసరికి తల్లడిల్లి పోయిందా తల్లి హృదయం.

ఆ రోజు ఎవ్వరూ ఎంగిలిపడలేదు. అంతా వాడికోసం కళ్ళల్లో వత్తులేసుకుని ఎదురు చూస్తూ కూర్చున్నారు.

కుటుంబంలో జరుగుతున్న పరిణామాల్ని ప్రేక్షకుడిలా గమనిస్తున్నానే తప్ప నోరు మెదపలేకపోయాను. కొడుకు అలా తయారవడానికి నేనే కారణం. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు. పెదవులు కుట్టుకున్నాను.

వారం రోజులు తరువాత కాలే కడుపుతో ఇంటికొచ్చాడు సూర్యం. చిక్కిశల్యమైన అతడి శరీరాన్ని చూసి చలించిపోయింది అర్చన. ప్రేమతో బిడ్డను అక్కున చేర్చుకుని కన్నీరు కార్చింది. కడుపు నిండా అన్నం పెట్టింది. దగ్గర పడుకోబెట్టుకుని తెల్లవార్లు బుద్ధులు చెప్పింది.

ఆమె చెప్పిన ప్రతి మాటకు ఊ కొట్టాడు సూర్యం. ఇక మీదట బుద్ధిగా ఉంటానని మాటిచ్చాడు. అది నోటి మాటే తప్ప ఆచరణలో చూపలేకపోయాడు.

బిడ్డను గురించి అర్చనకు బెంగపట్టుకుంది. ఫలితంగా ఆమెను మాయరోగం ఆవరించింది.

డాక్టర్ని పిలుచుకొచ్చాను. పరీక్షచేసి ప్రిస్కిప్షన్ రాసిచ్చాడు డాక్టరు. మందులు పట్టుకొస్తానిచెప్పి చీటీ డబ్బుల్తో పరారయ్యాడు సూర్యం.

కొడుకు చేసిన నిర్వాకానికి అర్చన ప్రాణం ఎక్కడ పోతుందోనన్న భయంతో, సూర్యం వాళ్ళ తాతగారిని పిలుచుకు రావడంకోసం ప్రొద్దుటూరు వెళ్ళాడని బొంకాను.

మళ్ళీ చీటీ రాయించుకుని మందులు కొనుక్కొచ్చేసరికి అర్ధాంగి ప్రాణం అనంతవాయువులలో కలసిపోయింది.

కొన్న మందులకు ఉన్న రేటుకంటే ఎక్కువ చెప్పడానికి అర్చన లేదిప్పుడు.

తల్లిని పట్టుకుని బావురుమంది కల్పన. నా కళ్ళంట నీరు రావడం లేదు.

కొడుకుండి కొరివి పెట్టించుకోలేక పోవడంతో ఆ పని నేనే చేసాను.

అల్లకల్లోలంగా ఉంది నా మనసు. శాంతి కోసం సముద్రపు ఒడ్డుకు చేరుకున్నాను. ఊరట కోసం తదేకంగా సముద్రం వైపు చూసాను. రోలు వెళ్ళి మద్దెలతో మొరపెట్టుకున్న భావన కలిగింది. సముద్రం పొందుతున్న అలజడిని గ్రహించాను. మూడొంతుల భూభాగాన్ని ఆక్రమించిన అంత మహాసముద్రానికి కూడా ఆటుపోట్లు తప్పడం లేదు. అంతేకాదు. నిశ్చలంగా నిలబడ్డ ఈ భూమికూడా సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తూనే ఉంది. అటువంటప్పుడు మనం ఎంత?

అన్నీ అయ్యాక ఇంటికొచ్చాడు సూర్యం.

తల్లి చావుతోనైనా బిడ్డలో మార్పువస్తుందేమోనని ఆశపడ్డాను.

అర్చన ఆర్జన ఆగిపోవడంతో ఇల్లు గడవడం గగనమైపోయింది. ఇంటిని రెండు భాగాలుగా చేసి ఓ భాగం అద్దెకిచ్చాను.

సూర్యం చదువుకు పూర్తిగా స్వస్తి చెప్పేసాడు. దినమంతా స్నేహితులతో తిరగడం మొదలుపెట్టాడు. ఏవేళకో బుద్ధిపుడితే ఇంటికొస్తాడు లేకపోతే లేదు.

పిల్లాడి విషయం పట్టించుకోవడం మానేసాను. ఉన్నట్లుండి ఇంట్లో అనుహ్యామైన పరిణామం సంభవించింది. సూర్యం అద్దెకున్న వాళింట్లో బంగారు నగ కాజేసి పరారయ్యాడు.

పోలీసు రిపోర్టిస్తామన్నారు వాళ్ళు.

కన్న బిడ్డను చేతులారా చెరసాలకు పంపలేక ఇంట్లో వున్న చిన్నచితక వస్తువులన్నీ అమ్మేసి వారి ఋణం తీర్చాను.

నాటి నుండి సూర్యం జాడలేదు. ఇక ఆ ఊళ్ళో ఉండబుద్ధిగాక కొంపగోడు అమ్ముకుని బయట పడ్డాను. మనసుకు ప్రశాంతంగా ఉంటుందని పద్మనాభం వచ్చి స్థిరపడ్డాను. కల్పనను భీముని పట్నం కాలేజీలో చేర్పించాను. అది ఉదయాన్నే బస్సు మీద భీమిలివెళ్ళి సాయంత్రానికల్లా తిరిగొస్తుంది.

సూర్యం క్రమేణా మా జ్ఞాపకాల పొరల్లోంచి దూరమవుతూ వుండగా మళ్ళీ వాడి గురించి పేపర్లో ఈ వార్త.

గతం గుర్తుకొచ్చి మొట్టమొదటి సారిగా నా కళ్ళ నుండి అశ్రువులు రాలాయి.

**(అక్టోబర్ 1995, గీతాంజలి)**